


# అధికుడు – అధికము

**మూలవాక్యము : 1యోహా 3:19,20** ఇందువలన మనము సత్యసంబంధులమని యెరుగుదుము. దేవుడు మన హృదయము కంటె అధికుడై, సమస్తమును ఎరిగియున్నాడు గనుక మన హృదయము ఏ యే విషయములలో మనయందు దోషారోపణ చేయునో ఆయా విషయములలో ఆయన యెదుట మన హృదయములను సమ్మతిపరచుకొందుము.ప్రియులారా, మన హృదయము మనయందు దోషారోపణ చేయని యెడల దేవుని యెదుట ధైర్యము గల వారమగుదుము.

**హృదయము మోసకరమైనది అది ఘోరమైన వ్యాధిగలదని యిర్మీయా 17 : 9 లో వ్రాయబడి ఉంది. మన హృదయము నిత్యము మనలను మోసపుచ్చే ప్రయత్నము చేస్తుంది. మనలోని బలహీనతలను, లోపములను, పాపములను దాచే ప్రయత్నము చేస్తుంది. అయితే ఎవరి హృదయములో అయితే దేవునికి చోటు వుంటుందో ఆ వ్యక్తి ఏదైనా పొరపాటు చేసినప్పుడు అతని హృదయము అతని మీద దోషారోపణ చేస్తుంది. ఆ సందర్భములో ఆ దోషములను దేవుని సన్నిధిలో ఒప్పుకోవాలి. ఎందుకనగా దేవుడు హృదయమును అంతరింద్రియములను పరిశీలించువాడని కీర్తనలు 7 : 9 లో వ్రాయబడియుంది. గనుకనే దేవుడు మన హృదయముకంటే అధికుడని వాక్యము చెబుతుంది.**

**దేవుడు ఎలాంటివాడు? ఆయన ఏమేమి చేయువాడు? :**

**1. అధిక బలసంపన్నుడు : యోబు 9:4** ఆయన మహా వివేకి, అధిక బలసంపన్నుడు ఆయనతో పోరాడ తెగించి హాని నొందనివాడెవడు?

**యిర్మీ 27:5** అధిక బలముచేతను చాచిన బాహువు చేతను భూమిని భూమి మీద నున్న నరులను జంతువులను నేనే సృజించి, ఎవరికిచ్చుట న్యాయమని నాకు తోచునో వారికే యిచ్చుచున్నాను.

**2. అధిక శక్తి గలవాడు : కీర్త 147:5** మన ప్రభువు గొప్పవాడు ఆయన అధిక శక్తి గలవాడు ఆయన జ్ఞానమునకు మితిలేదు.

**అత్యధికముగా చేయ శక్తి గల దేవుడు : ఎఫె 3:20** మనలో కార్యసాధకమైన తన శక్తి చొప్పున మనము అడుగు వాటన్నిటికంటెను, ఊహించువాటన్నిటికంటెను అత్యధికముగా చేయ శక్తి గల దేవునికి

**3. అధిక తేజస్సు గల దేవుడు : కీర్త 76:4** దుష్టమృగములుండు పర్వతముల సౌందర్యము కంటె నీవు అధిక తేజస్సుగలవాడవు.

**4. అధిక ఘనత వహించినవాడు : కీర్త 104:1** నా ప్రాణమా, యెహోవాను సన్నుతించుము. యెహోవా, నా దేవా నీవు అధిక ఘనత వహించినవాడవు నీవు మహాత్మ్యమును ప్రభావమును ధరించియున్నావు.

**5. అధికముగా హెచ్చించు వాడు: ఫిలి 2:11** ప్రతివాని నాలుకయు తండ్రియైన దేవుని మహిమార్థమై యేసుక్రీస్తు ప్రభువని ఒప్పుకొనునట్లును, దేవుడు ఆయనను అధికముగా హెచ్చించి, ప్రతి నామమునకు పై నామమును ఆయనకు అనుగ్రహించెను.

**6. అధికముగా సంతానాభివృద్ధి కలుగజేయువాడు : కీర్త 107:38** మరియు ఆయన వారిని ఆశీర్వదింపగా వారు అధికముగా సంతానాభివృద్ధి నొందిరి ఆయన వారి పశువులను తగ్గిపోనియ్యలేదు.

**7. అధిక బుద్ధియు అనుగ్రహించువాడు : యెష 28:29** జనులు సైన్యములకధిపతియగు యెహోవా చేత దాని నేర్చుకొందురు. ఆశ్చర్యమైన ఆలోచనశక్తియు అధిక బుద్ధియు అనుగ్రహించువాడు ఆయనే.

**8. అధిక విశ్రాంతి కలుగజేయువాడు : యెష 54:13** నీ పిల్లలందురు యెహోవా చేత ఉపదేశము నొందుదురు నీ పిల్లలకు అధిక విశ్రాంతి కలుగును.

**9. అత్యధిక విజయము కలుగజేయువాడు : రోమా 8:37** అయినను మనలను ప్రేమించినవాని ద్వారా మనము వీటన్నిటిలో అత్యధిక విజయము పొందుచున్నాము.

**10. అధిక సంవత్సరములు జీవింపజేయువాడు : సామె 9:11** నా వలన నీకు దీర్ఘాయువు కలుగును నీవు జీవించు సంవత్సరములు అధికములగును.

**ముగింపు:**

**మత్త 5:20** శాస్త్రుల నీతికంటెను పరిసయ్యుల నీతికంటెను మీ నీతి అధికము కాని యెడల మీరు పరలోక రాజ్యములో ప్రవేశింపనేరరని మీతో చెప్పుచున్నాను.

**శాస్త్రులు పరిసయ్యులు పుదీనా, సదాపా, జీలకర్రలలో పదియవ భాగము దేవునికి అర్పించువారు. అయినప్పటికి సాటి మనుష్యులను ప్రేమింపనివారు, వారిపై కనికరము చూపనివారు, వారితో న్యాయముగా ప్రవర్తింపనివారునై యున్నారు. వారు చెప్పుదురే గాని చేయనివారు. అనగా మారు మనస్సులేని వారు. మనము ఆలాగున వుండక మారు మనస్సు పొందిన వారమై నీతిని, న్యాయమును కనికరమును గలవారమై వాక్యాను సారముగా జీవించినట్లయితే పరలోక రాజ్యములో ప్రవేశిస్తాం. గనుక శాస్త్రుల నీతికంటెను పరిసయ్యుల నీతి కంటెను మన నీతి అధికముగా ఉండునట్లు చూచుకుందాం.**

**అలాంటి కృప పరిశుద్ధాత్మ దేవుడు మనకు అనుగృహించును గాక. ఆమేన్.**